విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 11, నవంబర్ 2025

డీజీ లక్ష్మి పథకంతో ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన డిజి లక్ష్మిపథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలకు, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు డిజిటల్ సాధికారత, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నా యని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లో డిజి లక్ష్మీ పథకంపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రతి పట్టణ స్థానిక సంస్థ పరిధిలో సాధారణ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయబడతాయని, వీటిని అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా మహిళలు తమ నివాస ప్రాంతాల నుంచే ప్రభుత్వ డిజిటల్ సేవలను ప్రజలకు అందించడం ద్వారా ఉపాధి పొందగలుగుతారనిన్నారు. జిల్లాలో ఆరు మునిసిపాలిటీలలో 9,710 స్వయం సహాయక సంఘాలుండగా, వాటిలో 83,294 మంది మహిళా సభ్యులున్నారని, ఈ పథకం కింద ప్రతి 250 పేద కుటుంబాలకు ఒక కియోస్క్ సెంటర్ ఏర్పాటు చేయాలని, జిల్లాలోని 324 స్లం లెవెల్ సమాఖ్యల్లో డిజి-లక్ష్మి కియోస్క్ సెంటర్లు ఏర్పాటు చేయబడి, 324 మంది మహిళలు డిజి-లక్ష్మిలుగా ఎంపికవుతారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కేంద్రాల స్థాపనకు అవసరమైన కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, ఇతర పరికరాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా 2.50 లక్షల వరకు రుణం అందించబడుతుందన్నారు. అంతకు ముందు మెప్మా పిడి వెంకట దాసు పథకం గురించి వివరించారు.

వ్యవసాయ కార్మికులకు వేతనం పెంచాలి

విశాలాంధ్ర - మహానంది : రాష్ట్రంలో గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు భూమిపై హక్కు కల్పించి వ్యవసాయ కార్మికులకు రూ.600 రూపాయలు రోజువారి వేతనం ఇచ్చి, 300 రోజుల పని దినాలను కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేయంయు) జిల్లా అధ్యక్షులు కె.రాధాకృష్ణ తెలిపారు. సోమవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం రామేశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ బంజర్లు, ప్రభుత్వ పోరంబోకు భూములు, అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను గుర్తించి పేద ప్రజలకు దక్కే విధంగా వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో పేదలకు పంచి పెట్టడానికి అవకాశం ఉన్న భూములను గుర్తించి,అటువంటి భూములపై పోరాటం చేసే విధంగా పేద ప్రజలలో చైతన్యం కల్పించుటకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వం కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం మహానంది మండల నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా లక్ష్మణ్ మండల ప్రధాన కార్యదర్శిగా రామేశ్వరయ్యతో పాటు తొమ్మిది మందిని నూతన కమిటీ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు, గురుమూర్తి,దస్తగిరి, నాగరాజు వెంకటేశ్వర్లు,మహమ్మదు, లక్ష్మయ్య, రమీజా, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యం వీడాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : నియోజకవర్గం పరిధిలోని ఆర్ అండ్ బి రహదారులపై అధికారులు నిద్రమత్తు వదిలి వాటిని పర్యవేక్షించి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని సిపిఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి ఉన్నతాధికారులను కోరారు. సోమవారం స్థానిక తాసిల్దార్ ఆఫీస్‌లో తహసిల్దార్ శ్రీనివా సులుకి సీపీఐ నాయకులు బృందం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా చెడిపోయి గుంతల మయం కావడంతో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఆటో ప్రయాణికులు ప్రమాదాల బారినపడి తీవ్ర గాయాలు పాలై అలాగే ప్రాణాలు కోల్పోతున్నారని వారు తెలిపారు. ఆర్ అండ్ బి అధికారులు రహదారుల పర్యవేక్షణ లేదని ఏఈ చుట్టపు చూపుగా వచ్చి వెళుతుంటారని ,సిబ్బంది కేవలం కుర్చీలకే పరిమితమై నిద్రమత్తులో ఉన్నావారి పై ఉన్నతాధికారులు శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నందికొట్కూరు నుంచి పగిడ్యాలకు వెళ్లే రహదారిని ఆర్ అండ్ బి పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యంగా నందికొట్కూరు నుంచి మిడుతూరుకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే అన్నారు. కాబట్టి ప్రభుత్వం మరియు ఆర్ అండ్ బి అధికారులు త్వరగా రోడ్లు వేయించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సీపీఐ నాయకులు నాగేంద్ర, రవికుమార్, జిన్ను మాలిక్, తదితరులు ఉన్నారు.

మండల సమితి సమావేశం జయప్రదం చేయండి

విశాలాంధ్ర- ఆత్మకూరు రూరల్ :పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఈనెల 12న జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య మండల సమితి సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఐ తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అహమ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు కార్మికులంతా సంఘటితం కావాలన్నారు. కనీస వేతనం కార్మికుల పని భద్రత ప్రమాద బీమా పంటి అంశాలను చర్చించేందుకు కార్మికులంతా సమావేశానికి హాజరు కావాలన్నారు. తాలూకా కార్యదర్శి శివ నారాయణ,మహిళా సమాఖ్య తాలూకా కార్యదర్శి మూర్తు జాబి, ఎన్ లక్ష్మీదేవి,ఏఐటీయూసీ నాయకులు లాలు, సురేష్ పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఆధ్వర్యంలో ప్లేట్ల పంపిణీ

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయు రాలు ఉమా రాణి ఆధ్వర్యంలో ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండు రంగానాయక్‌తో కలిసి 350 ప్లేట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాణి విజ్ఞప్తి మేరకు ఎల్ఐసి స్టాఫ్ అందరం కలిసి విద్యార్థునులకు 350 ప్లేట్లు అందచేసామని ఇంకా 150 ప్లేట్లు త్వరలోనే అందిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏవో రాజశేఖర్ నాయక్, ఏ, ఎస్‌జిఏ శోభారాణి, అసిస్టెంట్ సుచిత్ర, ఐసీయూ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, సెక్రటరీ రవికుమార్, జాయింట్ సెక్రెటరీ నాగన్న, ప్రవీణ్, లియాఫీ అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ట్రెజరర్ రాంబాబు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించండి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని మండల విద్యాధికారి అబ్దుల్ కలాం తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల(ఎస్సి) రికార్డులను మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఇటీవల డీఎస్సీలో ఎంపికై నూతన ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మనోజ్, శ్రావణిలకు పలు అంశాలను తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన విధివిధానాలు, లక్ష్యాలు, ఉద్దేశాలను తెలిపారు. పాఠశాల రికార్డ్స్‌ను ఎలా మెయింటైన్ చేయాలి, మధ్యాహ్నం భోజనాన్ని ఎలా పరిశీలించాలి. పాఠశాలలో విద్యార్థుల పట్ల ఎలా మెలగాలి తదితర వాటిని వివరించారు. ఉత్తమ నాణ్యమైన విద్యాబోధనను చేసి విద్యార్థులలో విద్య పట్ల ఆసక్తి, క్రమశిక్షణ పెంపొందించాలా చూడాలని తెలిపారు. వీరి వెంట అకౌంటెంట్ కాంతారావు, సిఆర్‌పి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలో ప్రథమ స్థానం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : 69వ ఎస్‌జిపీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలలో మండలానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని అత్యున్నత ప్రతిభా కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ఎంఈఓ అబ్దుల్ కలాం సోమవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని తిమ్మనాయుని పేట గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల యందు 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని టి.అవంతిరాణి రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈనెల 8,9,10వ తేదీలలో శ్రీకాకుళంలో నిర్వహించిన అథ్లెటిక్ అండర్ 14 బాలికల విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో ఉమ్మడి కర్నూలు జిల్లా తరఫున పోటీలో పాల్గొన్న అవంతిరాణి విశేష ప్రతిభా కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. గ్రామంలోని ఆకాంక్ష స్పోర్ట్స్ అకాడమీలో అవంతిరాణి శిక్షణను తీసుకున్నారు. మారుమూల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అవంతిరాణి క్రీడా ప్రతిభతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో కూడా రాణించి పాఠశాలకు మండలానికి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన స్కార్పియో వాహనం

విశాలాంధ్ర - పాణ్యం : మండల పరిధిలోని బలపనూరు గ్రామ సమీపంలో గల జాతీయ రహదారి 40పై గల బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లార్జామున మహారాష్ట్రకి చెందిన స్కార్పియో వాహనం డివైడర్ పైకి వెళ్లి ప్రమాదానికి గురై మహేష్ రుద్రయ్య మత్పత్తి 51 సంవత్స రాలు అనే వ్యక్తి మృతి,ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడం జరిగిందని ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర పరబని జిల్లాకు చెందిన స్కార్పియో వాహనంలో తిరుపతికి దర్శనానికి వెళ్తూ డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్ను ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు.సందీప్ ఉత్తమ్ రావు జాదవ్, డ్రైవర్ కన్నాబి రామ్ లాల్ దూతని అనే ఇరువురికి తీవ్ర గాయాలు కావడం జరిగిందన్నారు. హైవే సిబ్బంది ప్రమాద స్థలానికి హుటాహుటిన చేరుకొని క్షతగాత్రులను దగ్గరలోని శాంతిరాం హాస్పిటల్ కు చేర్పించారు.మృతున్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు.

వరి పంటపై పంజా విసిరిన ఉల్లికోడు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. వరి పంటపై ఉల్లికోడు వైరస్ పంజా విసిరింది. పెట్టిన పెట్టుబడి నెత్తికి వచ్చే పరిస్థితి. ఎదురవుతున్నదని రైతన్నలు విలవిల్లాడుతున్నారు. సొంత భూమి గల రైతులు పెట్టుబడి వస్తుందా రాదా అనే పరిస్థితి ఉంటే కౌలు రైతు పరిస్థితి ధీనాతి దీనంగా మారింది. ఉల్లికోడు దెబ్బకు దిగుబడులు తగ్గి పెట్టుబడులు నెత్తికొచ్చే పరిస్థితి ఎదురవుతున్నదని శిరివెళ్ల మండలం గంగవరం గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరం గ్రామంలో అత్యధికంగా వరిసాగు చేశారు. విత్తనం వద్ద నుంచి నారపోసి నీరు పెట్టి నాటు వేసి పెట్టుబడి పెట్టి పంట చేతికి అందే దశలో ఉల్లికోడు రైతన్నల పాలిట పెను శాపంగా మారిందని వరి రైతులు పేర్కొంటున్నారు. గంగవరం గ్రామానికి చెందిన తెలుగు శివుడు సుమారు 7 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా పొలం అంతా ఉల్లి కోడు వ్యాపించింది. దిగుబడులు సగానికి సగం తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన మొంత తుఫాను ఒకవైపు ఉల్లికోడు మరోవైపు అధిక పెట్టుబడులు పెట్టి కష్టాల్లో ఉన్న అన్నదాతలకు గోరుచుట్టు పై రోకలి పోటులా మారిందని అంటున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతన్నలు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు.

అహోబిలేసుని దర్శించుకున్న సినీ నటుడు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మి నరసింహ స్వామిని సినీ నటుడు, నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ సోమవారం దర్శించుకున్నారు. ఎగువ, దిగువ క్షేత్రాలలో కొలువైన భూదేవి శ్రీదేవి సమేత నరసింహస్వామిని ఆయన దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అహోబిల క్షేత్ర విశిష్టతను ఆయనకు వివరించారు.

సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర-డోన్ : పట్టణ సమీపంలో ఉన్న జగనన్న కాలనీ నిర్మించుకున్న ఇళ్లకు సౌకర్యాలు కల్పించాలని సోమవారం తహసీల్దార్ రవి కుమార్‌కు ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ మాట్లాడుతూ పట్టణంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఉడుములపాడు, దొరపల్లి గ్రామ సమీపంలో జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ డోన్ మండల కార్యదర్శి పృథ్వి కుమార్, మండల సహాయ కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి రజాక్, నాయకులు ఖాదర్ బాషా,పాల్గొన్నారు.

హఫీజ్ అంజద్ బాష సిద్దీఖికి డా. అబ్దుల్ హఖ్ అవార్డు

విశాలాంధ్ర - బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం ఖలీల్ సిద్దీఖి హైస్కూల్‌లో ఉర్దూ లాంగ్వేజ్ పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న హఫీజ్ అంజద్ బాష సిద్దిఖిని అరుదైన డా.అబ్దుల్ హఖ్ అవార్డుకు ఎంపికయ్యారని, విజయవాడలోని తుమ్మల పల్లి కళాక్షేత్రంలో జాతీయ విద్యా దినోత్సవం, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా డా. అబ్దుల్ హఖ్ అవార్డుకు రావాల్సినదిగా రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమి ద్వారా ఆహ్వానం అందినట్లు అవార్డు గ్రహీత హఫీజ్ అంజద్ బాష సిద్దీఖి తెలుపారు. ఉర్దూ పాఠశాలల బలోపేతం, ఉర్దూ భాషాభివృద్ధి, ముస్లిం సమాజంలో నైతిక విలువలు పెంపొందించేదుకు చేసిన కృషికి గాను డా. అబ్దుల్ హఖ్ అవార్డు స్వీకరిస్తున్న హఫీజ్ అంజద్ బాష సిద్దిఖిను ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ సి. అబ్దుల్ అజీజ్, నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షమీమ్ బాను, అంజద్ షరీఫ్ అభినందనలు తెలిపారు.

అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటు

విశాలాంధ్ర - బనగానపల్లె: తెలంగాణ సాహితీ శిఖరం, ప్రజల కవి అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అందెశ్రీ ఆకస్మిక మరణం తనకు తీవ్ర దిగ్భ్రాంతితో పాటు ఆవేదనను మిగిల్చిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో తన అక్షరాన్ని ఇంధనంగా మార్చి ప్రజల్లో నిత్య చైతన్యాన్ని జ్వలింపచేసిన గొప్ప యోధుడు అందెశ్రీ అని కొనియాడారు. నిత్యం పేదల పక్షాన గొంతుక వినిపించిన నిస్వార్థ పరుడు, తెలంగాణ మట్టి మనిషి అందెశ్రీ తో తనకు వ్యక్తిగతంగా కూడా పరిచయం ఉందని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీ భౌతికంగా మన మధ్య లేకపోయినా తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతమైన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గేయం, రచనలు, సాహిత్యం నిత్యం ప్రజల గుండెల్లో నిలిచే ఉంటాయన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నంద్యాల జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి ఎ.శివయ్య అందెశ్రీ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఆర్జీఎంలో భారీ స్థాయి ప్రాంగణ ఎంపికలు

విశాలాంధ్ర - పాణ్యం : మండలం లోని ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కళాశా లలో మొట్టమొదటిసారిగా భారీ స్థాయిలో ప్రాంగణ ఎంపికలు నిర్వ హన సోమవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సంస్థ ఇంచార్జ్ సత్య రత్నం ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలో రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు, కడప, రాజంపేట, సత్యసాయి, అనంతపురం జిల్లాల నుండి 5000 మంది విద్యార్థినిలు ఈ ప్రాంగణ ఎంపికలో పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే ఈ ఎంపికలో నాలుగవ సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థినీలు పాల్గొంటున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థినీలకు మౌఖిక రాత పరీక్షలు,ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన విద్యార్థినీలకు వార్షిక వేతనం కింద రూ.3.6 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధి హర్ష దీప్ పత్ర ఎంపికలో పాల్గొన్న విద్యార్థినీల భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. విద్యార్థినీలు తమ లక్ష్య సాధనలో ముందుండాలని కోరారు.విద్యార్థినిలకు కళాశాల ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. కళాశాల ప్రాంగణ అధికారి డాక్టర్ సుధీర్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసి మంచిపేరు తీసుకురావాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ యూనిట్ ఖజాపీర్, నంద్యాల యూనిట్లో జాఫర్ వలి హెూంగార్డ్‌గా విధులు నిర్వహిస్తు అనారోగ్య కారణాల వల్ల హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నుండి వారికి రావసిన బెన్ఫిట్స్ అందించడం జరిగిందని జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ తెలిపారు. అలాగే ఖజాపీర్ భార్య జహీర్ బీ, జాఫర్ వలి భార్య తయాబా బేగమ్‌లకు హెూంగార్డ్‌గా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ చేతుల మీదుగా జిల్లా పోలీసు కార్యాలయం నందు హెూంగార్డ్ నియామక ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-అవుకు: అవుకు పట్టణంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ హేమీమా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన జిల్లా స్థాయిలో జరిగిన ఎలక్ట్రానిక్ ట్రేడ్ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు హుస్సేన్, వలి రూపొందించిన స్మార్ట్ సిటీ ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించి ఒదని అన్నారు. ఈనెల 21వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యేలా విద్యార్థులకు శిక్షణను ఇచ్చిన ఒకేషనల్ ఉపాధ్యాయుడు నరేంద్రను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. సోమవారం మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రూ.3,90,367 లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మల్యేం గ్రామానికి చెందిన ఎం.నాగన్నకు రూ.14,848, తరిగోపుల గ్రామానికి చెందిన రిత్విన్‌కు రూ.3,10,645 పోతులపాడు గ్రామానికి చెందిన శేషమ్మకు రూ.25,655 జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన మోతే శేఖర్‌కు రూ.12000 అబ్దుల్ సత్తార్‌కి రూ.27,219 లబ్ధిదారుల ఇంటి దగ్గరికి వెళ్లి సీఎం సహా యనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గిత్త జయ సూర్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, టిడిపి మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, తత్తులు దేవస్థానం ఆలయ కమిటీ ఛైర్మన్ మండడి నారాయణరెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గిరీశ్వర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ పిక్కిలి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేయడం జరిగిందని 17వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయం నందు 17వ వార్డు కోటి సంతకాల సేకరణ పత్రాలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా 17వ వార్డుకు ఇచ్చినటువంటి లక్ష్యాన్ని సంపూర్ణంగా పూర్తి చేసి మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డికి పత్రాలను 17వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకులు బి.చంద్ర, శిలాస్‌లు సమీర్పించారు.

యాగంటిలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం ఎర్రమల కొండల్లో వెలిసిన శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి వారిని సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాస మూడో సోమవారం సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి జయమ్మకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వర స్వామి తీర్థ ప్రసాదలను వారికీ అందజేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి తెలిపారు.

కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ :పట్టణంలో కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తున్నామని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ నందు మూడు రోజుల నుండి కుక్కల వేట కొనసాగిందని, రోజు 30 నుండి 50 కుక్కల వరకు బస్టాండ్, హాస్పిటల్ దగ్గర మెయిన్ రోడ్డులో పట్టుకోవడం జరుగుతుందన్నారు. ఆత్మకూరు పట్టణ ప్రజలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చిన్న పిల్లలకు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండాలని, ఈ కుక్కలను పట్టుకోమని మున్సిపాలిటీ ఆదేశాల కొరకు కుక్కలు పట్టుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 150 కుక్కలు పట్టుకున్నారన్నారు. వీధి వీధిన తిరిగి పట్టుకుంటున్నారని శివ ప్రియ నగర్, పలు కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కానిస్టేబుల్ శిక్షణను ప్రారంభించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్ర పోలీస్ శాఖలో ఎంపికైన కానిస్టేబుళ్ల శిక్షణను తక్షణమే ప్రారంభించాలని, 6,100 మంది యువత భవిష్యత్తు కాపాడండని డిఆర్ఓ రామునాయక్ కు ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పోలీస్ శాఖలో 2022 నవంబరులో విడుదలైన కానిస్టేబుల్ పోస్టుల నోటిఫికేషన్ ప్రకారం ప్రిలిమ్స్, ఫిజికల్ టెస్టులు, మెయిన్స్, మెడికల్ పరీక్షల వంటి అన్ని దశలు పూర్తయ్యాయని, ఈ నియామక ప్రక్రియలో విజయవంతమై, పోలీస్ శాఖలో శిక్షణ ప్రారంభం కావాలనే ఆశతో నెలలుగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ నియామక ప్రక్రియ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ శిక్షణా తరగతులు ప్రారంభం కాలేదన్నారు. దీనివల్ల వేలాది మంది యువకుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందన్నారు. కావున కానిస్టేబుళ్ల శిక్షణ షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేసి శిక్షణ కార్యక్రమాలను తక్షణమే ప్రారంభించి, నియామక ప్రక్రియను పూర్తిచేయాలని డిఆర్ఓ రామునాయక్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరామడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, పాములేటి, శేఖర్ లు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మారుమోగుతున్న శ్రీశైలం

విశాలాంధ్ర - శ్రీశైలం : శ్రీశైలం మహా క్షేత్రంలో కార్తీక మూడవ సోమవారిని పురస్కరించుకొని వేకువజాము నుండే అధిక సంఖ్యలో స్వామి అమ్మ వార్లను దర్శించుకునేందుకు పోటీపడ్డారు. పాతాళ గంగలో పుణ్యస్నానా లాచరించుకుని శ్రీస్వామిఅమ్మ వార్ల దర్శనం కోసం ఏ కుజం నుండి క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. దర్శనం ఏర్పాట్లు కార్తీకమాసంలో ప్రభుత్వసెలవుదినాలు, కార్తీక సోమవారాలు మరియు కార్తీకపౌర్ణమి రోజులలో భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకోవడం భక్తులందరు సంతృప్తికరంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు వీలుగా దర్శన ఏర్పాట్లు చేయడం జరిగింది. దర్శనం ఏర్పాట్లు వేకువజామున 3గంట లకు ఆలయ ద్వారాలు తెరచి ప్రాత:కాలసేవలను జరిపించిన అనంతరం వేకువజామున గం.4.30ల నుంచి సాయంత్రం గం.4.00ల వరకు దర్శనాలను కొనసాగించడం జరుగుతోంది. అదేవిధంగా తిరిగి సాయంత్రం గం.5.30ల నుంచి దర్శనాలు అదేవిధంగా కార్తీకమాస రద్దీరోజులలో అనగా శని,ఆది,సోమవారాలు శుద్ధఏకాదశి, కార్తీక పూర్ణిమ మొదలైన రోజులలో స్వామివారి స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేయబడింది. ఈ రద్దీరోజులలో సామూహిక ఆర్జిత అభిషేకాలను కూడా నిలుపుదల చేయడం జరిగినది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకై దేవస్థానం శాఖాధిపతులకు, పర్యవేక్షకులకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. కార్తీకమాసమంతా క్యూకాంప్లెక్స్‌లో వేచివుండే భక్తులకు ఉదయం నుంచే భక్తులకు వేడిపాలను కూడా అందజేయడం జరిగింది. అలాగే భక్తులకు అల్పాహారంగా పులిహెూర, పెరుగన్నం కట్టుపొంగలి, మంచినీరు బిస్కెట్లు అందజేయబడుతున్నాయి. భక్తులు కార్తికదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తర మాడవీధి మరియు గంగాధరమండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది. భక్తులకు అన్నప్రసాదవితరణభవనములో ఉదయం 10.30 నుండి అన్నప్రసాదాల వితరణ చేయబడుతున్నాయి. అలాగే సాయంత్రం గం. 6.30ల నుంచి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయబడింది. కార్తీకమాసంలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో లడ్డు ప్రసాదాలు సిద్ధం చేయబడ్డాయి. మొత్తం 10 కౌంటర్ల ద్వారా ప్రసాదాలు అందజేయబడుతున్నాయి సుమారు 70,000 మందిపైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని అంచనా..

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, మంగళవారం 11, నవంబర్ 2025

నియోజకవర్గంలో రోడ్లు అధ్వానం

విశాలాంధ్ర-హొళగుంద: ఆలూరు నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్న వెంటనే కొత్త రోడ్డు వెయ్యాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి డిమాండ్ చేశారు. హొళగుంద బస్టాండ్‌లో సోమవారం వైకాపా మండల కన్వీనర్ షఫీవుల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బీవీరుపాక్షి మాట్లాడుతూ నియోజకవర్గం లోనీ ప్రజలకు ప్రధానంగా రోడ్లు, త్రాగునీటి సమస్యలు పట్టిపీడిస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి, కూటమి నాయకులు చొరవచూపి రోడ్లు, త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కూటమి నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని వైకాపా కార్యకర్తలు, నాయకులపై దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. వైకాపా కార్యకర్తలు, నాయకులు ఎవరు అధైర్య పడద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని వైయసహా యంలో నియోజకవర్గ అభివృద్ధి చేపట్టడం ఖాయమని ధీ మా వ్యక్తం చేశారు. గతంలో పరిపాలించిన మంత్రులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేయడం వల్ల ప్రజాసమస్యలు అధికమయ్యాయని తీవ్రంగ దుయ్యబడ్డారు. ఆలూరు లో ఈ నెల 12న చేపట్టే భారీ ర్యాలీకి వైకాపా కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హాయంలో 12 మెడికల్ కాలేజీలు మంజూరు చేసి నిధులు విడుదల భవన నిర్మాణానికి శ్రీకారం చుడితే కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు మెడికల్ కాలేజీ లను అప్పగించడం ఎంతవరకు సభబని ప్రశ్నించారు. రాష్ట్ర వైకాపా కార్యదర్శి ఇమ్రాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, ఎంపీటీసీ మల్లికార్జున, వైకాపా నాయకులు ఈసా, శేషప్ప, అనుమప్ప, మల్లయ్య, పల్లె ఈరన్న, కాకి పకీరప్ప, కృష్ణయ్య, రామతుల్లా, కుమారస్వామి, వెంకటేష్ ,వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇచ్చిన హామీల అమలుకై

కదం తొక్కిన విద్యార్థి లోకం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : నగరంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు బారీ ప్రదర్శన నిర్వహించి కదంతొక్కారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర పురస్కరించుకొని 20వ రోజు సీఆర్ భవన్ నుండి వినాయక్‌ఘాట్, వైద్యశాల, మూడవ పట్టణ పోలీసుస్టేషన్ మీదుగా విజయాపాలడైరీ వరకు వరకు బారీ బారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అగ్రబాగాన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షకా ర్యదర్శులు వలరాజు, బందే నాసర్‌జీ, ఏఐఎస్ఎఫ్ పూర్వపు నాయకులు లెనిన్‌బాబు, మునెప్ప, చంద్రశేకర్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ మస్తాన్,ఫణీంద్ర,చలపతి నాగభూషణం గర్ల్స్ కమిటీ సభ్యులు హరిత, రాష్ట్ర నాయకులు యశ్వంత్, మాధవ,అమర్,అభి, జిల్లా కార్యదర్శి షాబీర్ భాష, జిల్లా ఆఫీస్ బేరర్స్ శరత్ కుమార్,రంగస్వామి,థామస్, దస్తగిరి,ఈరేష్, నగర కార్యదర్శి అశోక్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, నగర కార్యదర్శి భారతి తదితరులు పాల్గొన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి కళాకారుల దప్పుచప్పుళ్ళతో బారీ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ జిందాబాద్ అంటూ నినదించారు. ప్రజానాట్యమండలి కళాకారుల ఆలపించిన గేయాలు విద్యార్థినీ విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

గేయాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

13,14న సీపీఐ జిల్లా కార్యవర్గం, సమితి సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సీపీఐ జిల్లా కార్యవర్గం సమితి సమావేశాలు ఈనెల13, 14 తేదీల్లో కర్నూలులో సీ ఆర్.భవన్ నందు జరుగుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య ఒక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య ,పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. రామాంజనేయులు ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య ,ఆవుల శేఖర్ పాల్గొం టారన్నారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, జిల్లా సమగ్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.జిల్లా కార్యవర్గ సభ్యులు,సమితి సభ్యులు,ఆహ్వానితులు సకాల ంలో హాజరై సమావేశంను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జడ్పీ పాఠశాలను పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్‌లు

విశాలాంధ్ర-హొళగుంద: హొళగుంద జిల్లా పరిషత్ హై స్కూల్‌ను సోమవారం 6మంది ట్రైనీ ఐఏఎస్‌లు సోమవారం పరిశీలించారు. విద్యార్థుల విద్యా బోధన, మధ్యాహ్న భోజన పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు విద్యాలో మంచిగా చదివి తమలాగ ఎద గాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో సహపంక్తి భోజనం నిర్వహించారు. ట్రైనీ ఐఏఎస్‌లకు హెడ్మాస్టర్ కబీర్ సాబ్, విద్యార్థులు పూల ఉత్సవాలతో స్వాగతించారు. అంగన్వాడి కేంద్రాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. సీజనల్ హాస్టల్ పరిశీలించారు. ట్రైనీ ఐఏఎస్‌ల వెంట ఎంపీడీ వో విజయలలిత,ఎంఈఓ సుధారాణి,కబీర్ సాబ్,తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదు

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కి 23 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి నాగశివ ప్రసాద్, ఎంఈ మనోహర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, ఆర్ఓ జునైద్, కార్యదర్శి నాగరాజు, టిడ్కో అధికారులు పెంచలయ్య, మధు, సిఎంఎం భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు విజయవంతం

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : కర్నూలు జిల్లా తైక్వాండో పోటీలు విజయవంతం. ఉమ్మడి కర్నూలులో 9వ తేదీన హైదరాబాదు ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు జరిగిన జిల్లా స్థాయి టైక్వాండో పోటీలు విజయవంతంగా ముగిశాయి. వివిధ మండలాల నుండి ఆళ్లగడ్డ నంద్యాల, నందికొట్కూరు, బేతంచెర్ల, కర్నూలు నుండి 200 మంది పోటీలలో పాల్గొని బంగారు వెండి కాంస్య పతకాలను సాధించారు. గెలుపొందిన క్రీడాకారులను హైదరాబాదు స్కూల్ కరస్పాండెంట్ షేక్ ఫయాజ్ అభినందించారు. అలాగే తైకొండు జిల్లా ట్రెజరర్ బిలాల్ భాషా మాట్లాడుతూ బంగారు వెండి పథకాలను సాధించిన క్రీడాకా రులు ఈనెల కాకినాడలో 15,16 తేదీలలో జరగబోయే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎన్నిక అయినట్లు తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీలు విజయవంతం కావడానికి కారణమైన క్రీడాకారులు వారి తల్లిదండ్రులు కోచ్లు నాగన్న వెంకటేష్ ,రాంబాబు, జబీర్లకు, జిల్లా తైక్వాండో ఇన్చార్జి బి.వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు చరణ్ సాయి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప నగర్ ప్రభుత్వ జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చరణ్ సాయి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక అయ్యాడు. సోమవారం స్థానిక సోమప్ప నగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ బి.శకుంతల ,ఫిజికల్ డైరెక్టర్లు జి.సౌమ్య, బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో చరణ్ సాయి ను అభినందించారు. ఈ సందర్భంగా శకుంతల,సౌమ్య,శ్రీనివాసులు మాట్లాడుతూ సాయి చరణ్ గతంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యం లో జరిగిన మండల,డివిజన్,జిల్లా స్థాయి అండర్ 17బాలుర యోగా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. నవంబర్ 23,24 వ తేదీలలో బాపట్ల జిల్లా చందులూరు లో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక అయ్యారు. చరణ్ సాయి రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, జె.శ్రీనివాసులు,జీ లక్ష్మన్న,బి రామన్న,మల్లికార్జున, వీరేష్, నాగరా జు,చంద్ర శేఖరయ్య,యు నాగరాజు,జయరాజు,చంద్ర శేఖర్,ఖాదర్ వలి,అరుణ జ్యోతి,సరస్వతి,దేవమ్మ, షఫీన్నీషా బేగం, పద్మావతి, జయమ్మ,జయలక్ష్మి తో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకి శిక్షణ ప్రారంభించాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకి శిక్షణ వెంటనే ప్రారంభించాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు 2022లో ఎంపికైన పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థులకి శిక్షణ తక్షణమే ప్రారంభించా లని ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ సిరికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ.శ్రీరాములు, కె.శ్రీనివాసులు మాట్లాడు తూ గత ప్రభుత్వం హాయంలో రాష్ట్ర పోలీస్ శాఖ 2022 నవంబరులో 6100 కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి, పరీక్షలు, ఫిజికల్, మెయిన్స్, మెడికల్ ప్రక్రియలు పూర్తిచేసినప్పటికీ ఇప్పటివరకు శిక్షణ ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. ఎంపికైన 6,100 మంది అభ్యర్థులు అర్హత సాధించి నాలుగేళ్లు గడిచినా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా శిక్షణ నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆలస్యం వల్ల యువత నిరుత్సాహానికి, ఆర్థిక-మానసిక ఇబ్బందులకు గురవుతోందని పేర్కొన్నారు. ఈ సమస్య 6,100 మంది అభ్యర్థులే కాకుండా వారి కుటుంబాల ఆవేదన కూడా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే వారికి శిక్షణను ప్రారంభించడంతోపాటు రాష్ట్రంలో పోలీస్ శాఖ లో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని వారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బి.నాగరాజు, నగర నాయకులు చంటి ఉషన్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఉత్పత్తులను నిలిపివేయాలి

విశాలాంధ్ర - కర్నూలు : టీజీవీ రాయలసీమ ఆల్కాలిస్ సంస్థ ప్రమాదకర విషరసాయనం పోలిఎతిలిన్ ఉత్పత్తిని శాశ్వితంగా నిలిపివేయాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. సోమవారం ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కార్యవర్గ సమావేశం నగరంలోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో జరిగింది. వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుండి అనుమతులు పొందిన తర్వాత ఈ రసాయన ఉత్పత్తులను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఈ రసాయనాల ఉత్పత్తులను ఎప్పుడో నిలిపి వేశారని, ప్రజల ఆరోగ్యం పై తీవ్ర దుష్పరిణా మాలను, కర్నూలు నగరంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామా ల పర్యావరణం పై పడనున్న దుష్ప్రభావాన్ని, తుంగభద్ర, కృష్ణా నదుల నీటిపై పడనున్న ప్రభావాన్ని, పరిగణన లోకి తీసుకొని, హానికరమైన విష రసాయనాల ఉత్పత్తిని శాశ్వితంగా నిలిపివేయాలని వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. తాము ఉత్పత్తిని నిలిపివేస్తున్న విషయాన్ని టిజివి యాజమాన్యం బహిరంగంగా పత్రికా ముఖంగా వివరణ ఇవ్వాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాము శాస్త్ర వేత్తలతో సంప్రదించి, జాతీయ హరిత ట్రిబ్యు నల్‌లో పిర్యాదు చేస్తామని తెలిపారు.కార్యవర్గ సమావేశం లో వివిధ సంఘాల నాయకులు రామకృష్ణా రెడ్డి, మనో హర మాణిక్యం, జహంగీర్, సుంకన్న, హమీద్, అబ్దుల్ అజీజ్, నాగన్న, రత్నం ఏసేపు, నౌషాద్‌లు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ క్రీడల్లో రాణించిన క్రీడాకారులను అభినందించిన మంత్రి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మరియు వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ గారు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అండర్-17 నరసరావుపేటల, అండర్-19 వైజాగ్‌లో, విజయవాడలో మాస్టర్ స్విమ్మర్స్ గేమ్స్‌లో విజేతలైన 12మంది క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో గర్వకారణం. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ధైర్యం, పట్టుదల వంటి విలువలు పెంపొందుతాయి. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నానన్నారు. క్రీడాకారులను సత్కరిస్తూ, వారి కోచ్‌లు మరియు తల్లిదండ్రుల కృషిని మంత్రి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.డి.వో భూపతి రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు

విశాలాంధ్ర - గోనెగండ్ల : గోనెగండ్ల గ్రామంలోని ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పరిష్కరించాలని కోరుతూ సోమవారం రోజు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరుకు గోనెగండ్ల మండల కాంగ్రెస్ నాయకులు ముల్లా ఖాసింవలి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించి నట్లు తెలిపారు. గ్రామంలో రెండు డెంగ్యూ కేసులు నమోదయ్యాయనీ ఒక బాలుడు మృతి చెందాడని తెలిపారు. వర్షాలకు పడిన నీరు గ్రామ పురవీధుల్లో ఉన్న గుంతల్లో నిలిచి దుర్వాసన వస్తున్న కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదన్నారు, ఉదయం సాయంత్రం వేళల్లో బ్యాంక్ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రయాణికులకు పాఠశాల విద్యార్థులకు అసౌకర్యం కలిగిస్తుందన్నారు, మండల కేంద్రంలో కనీసం సులబ్ కాంప్లెక్స్ లేక పోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వచ్చే మహిళలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పిచ్చి మొక్కలు మొలచాయన్నారు. గోనెగండ్ల గ్రామంలోని ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతూ సీజనల్ వ్యాధుల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారని వెంటనే ఆయా సంబంధిత శాఖలకు చెందిన అధికారుల ద్వారా గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఘనంగా సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు



విశాలాంధ్ర-పత్తికొండ: స్థానిక ఎస్టియు కార్యాలయంలో సోమవారం సిపి బ్రౌన్ జయంతి వేడుకలను ఎస్‌టియు, అరసం ఆధ్వర్యంలో ఘ నంగా నిర్వహించారు. ముందుగా సిపి బ్రౌన్, ప్రజా కవి అందెశ్రీ చిత్ర పటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ కొత్తపల్లి సత్యనా రాయణ, ఎస్‌టియు సీనియర్ నాయకులు బి.వీరస్వామిలు మాట్లాడుతూ చార్లెస్ పిలిప్ బ్రౌన్ తెలుగు సాహిత్యమునకు విశేష సేవ చేసిన ఆంగ్లేయుడని,తొలి తెలుగు శబ్ద కోసమును ప్రచురించి, తెలుగుజాతికి సేవ చేసిన నలుగురు ఆంగ్లే యులలో బ్రౌన్ ఒకరిని తెలిపారు. వేమన పద్యాలను సేకరించి, ప్రచురించి ఆం గ్లంలోకి అనువదించి ఖండాంతర వ్యాప్తి చేసిన మహనీయులు అని కొనియాడారు. **ప్రజాకవి అందెశ్రీ మరణం తీరని లోటు:** ప్రజాకవి అందెశ్రీ మరణం తీరని లోటు అని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాలను ఆయుధాలుగా మలుచుకుని సమాజాన్ని తట్టి లేపిన ఉద్యమ కవి అందెశ్రీ అన్నారు. ఆయన కలం, గళం ఒక గొప్ప సామాజిక మార్పును కాంక్షించే చైతన్యకవి అని తెలిపారు. ఎస్‌టియు మండల కార్యదర్శి మారుతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు బీరప్ప, బలరాం, వెంకటరాముడు, సూరి, చంద్రశేఖర్ రెడ్డి, నాగార్జున, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి బైకు బోల్తా.. యువకుడు దుర్మరణం

విశాలాంధ్ర-ఆలూరు : ఆలూరు మండలం అగ్రహారం సమీపంలో సోమవారం ఉదయం జరిగిన దుర్ఘటనలో హలహర్వి గ్రామానికి చెందిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. వివరాల ప్రకారం, హలహర్వి గ్రామానికి చెందిన పింజరి షేక్షావలి (35) సోమవారం పనిమీద ఆలూరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, కురువల్లి గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో షేక్షావలి తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు పింజరి మోదిన్ సాబ్, మాబుమ్మ దంపతుల కుమారుడు. ఆయనకు భార్య సాసభి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. యువకుడి అకస్మాత్తు మృతి పట్ల గ్రామంలో విషాదచాయ నెలకొంది. ఈ ఘటనపై ఆలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం : ఎంపీ

విశాలాంధ్ర - కర్నూలు సీటీ : చదువుతోనే సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు నగరంలోని స్థానిక సంపత్ నగర్‌లో గల ఉర్దూ రెసిడెన్సియల్ జూని యర్ కళాశాలలో నిర్వహించిన చిల్డ్రన్స్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతన కంప్యూటర్ ల్యాబ్ ను ప్రారంభించిన ఎంపీ, విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను తిలకించారు. ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబానికి చెందిన తాను చదువుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకు న్నానన్నారు. ప్రతి ఒక్కరు పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవా లని సూచించారు. ఇక గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కే.వి సుబ్బారెడ్డి కళాశాల అధినేత కే.వి సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సురేష్, లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - నందవరం : ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. సోమవారం ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కె .జనార్దన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్లు జి. బసవరాజు, ప్రసన్న రాజు సమక్షంలో తాలూకా వార్షిక సమావేశంలో మండల శాఖ ఎన్నికైంది. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా జి.లక్ష్మీనారాయణ, అధ్యక్షులుగా మోనె.నరసప్ప, ప్రధాన కార్యదర్శిగా కె. మహబూబ్ బాషా, ఆర్థిక కార్యదర్శిగా ఎన్.అశోక్ కుమార్లను ఎన్నుకున్నారు.కార్యవర్గంలో జిల్లా కౌన్సిలర్లుగా జి.బసవరాజు, బి.దేవ ప్రసన్నరాజు, జి.చంద్రశేఖర్, కె .రంగ స్వామిలను, ఎస్టియు మండల మహిళా కన్వీనర్గా శ్రీమతి నరసుబాయి, సిపిఎస్ కన్వీనర్ గా మైలే నరసప్ప, సహాధ్యక్షులుగా బి. ఈరన్న, ఎన్. చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా బి.రాఘవేంద్ర, ఆర్.సి.హెచ్. రామాంజనేయులు, రామలిం గమ్మ ,రహేలమ్మ, ధర్మన్న, ప్రమీల, ఎన్ .శివశంకర్, అబ్దుల్ రషీద్, కార్యదర్శు లుగా ఎ.నారాయణ రెడ్డి, సాలన్న, మహేష్, షరీఫ్, ఆదెన్న, హుస్సేనాబి, సురేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కార్య వర్గం నూతనంగా మెగా డీఎస్సీ ద్వారా ఎన్నికైన ఉపాధ్యాయులందరికీ జీతాల ను వెంటనే చెల్లించంచేట్లు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : వికలాంగుల భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలం కేటాయించాలని వికలాంగుల మండల సమైక్య నాయకులు రాజేష్ ,ఈశ్వరయ్య అన్నారు. సోమవారం తహసీల్దార్ రాజేష్‌కు ఐదు సెంట్ల స్థలం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 621 మంది వికలాంగులు ఉన్నారు వికలాంగుల సమస్యలు చర్చించుకోవడానికి భవనం లేదన్నారు. వికలాంగులకు ఫిజియోథెరపీ పరిక రాలు వాటికి సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్లు అవసరమన్నారు. వికలాంగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రగతి మండల వికలాంగుల సమైక్య ఏర్పడిం దన్నారు. వికలాంగులపై దయవుంచి మండల కేంద్రంలో ఐదు సెంట్ల స్థలమును కేటాయించి భవన నిర్మించాలని వారు తెలిపారు. చాలాసార్లు మండల అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేసిన సమస్య పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వికలాంగుల సమస్యలు పట్టించుకోని న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వికలాంగులు తదితరులు ఉన్నారు.

టీడీపీ మండల అధ్యక్షులుగా దుగ్గుపాటి నాగిరెడ్డి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండల టీడీపీ అధ్యక్షులుగా టీడీపీ అధిష్టానం దుగ్గుపాటి నాగిరెడ్డిని ఎంపిక చేశారు. దుగ్గు పాటి నాగిరెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లు మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పిం చినందుకు పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి,నాయకులు గౌరు వెంకట రెడ్డికి, సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలో ఉన్న గ్రామాలలోని నాయకులను సమన్వయం చేసుకొని పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని ఆయన తెలిపారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

విశాలాంధ్ర - కర్నూలు : స్కూల్ గేమ్స్ టైక్వాండో పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అభినందించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడి టోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇటీవల రాష్ట్ర స్థాయి కడప జిల్లా రైల్వే కోడూరులో నిర్వహి ంచిన బాలికల విభాగం అండర్- 19లో డి. సుగందిని, వెండి పత కం, యు.ఇంద్రాణి కాంస్య సాధించారు. ఏలూరులో నిర్వహి ంచిన అండర్ -17 విభాగంలో బి.లేఖ్యశ్రీ చందన వెండిపతకం,ఎం ఆర్. నక్షత్ర కాంస్య, బాలుర విభాగంలో డి.రేవంత్ కాంస్య పతకం సాధిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచిసాధన చేయించి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని పతకాలు వచ్చేలా కృషి చేసిన కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్‌ను అభిందించారు. ముఖ్యంగా బాలి కలను ఈ స్థాయికి తేవడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుత సమాజం లో బాలికలకు టైక్వాండో లాంటి క్రీడాలు సాధన చేయడం చాలా ముఖ్యమన్నారు. డీఈఓ సామ్యూల్ పాల్ కూడా అభినదించారు. నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ ఎంఎస్.శ్రీనివాసరెడ్డి, డిఎస్ డిఓ భూపతిరావు, అండర్ 19 సెక్రటరీ కె.రాఘవేంద్ర, అండర్ 17 సెక్రెటరీ టి.కృష్ణ, క్రీడా కారుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ అడ్డుకుంటాం : వైసీపీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : డబుల్ సర్కార్ మెడలు వంచైనా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హులికన్వి సర్ప ంచ్ చిన్న మహదేవ, వైసీపీ నాయకులు ఈరన్న, భీమన్న, చిన్న భీమరాయుడు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కంబలదిన్నె, హులికన్వి గ్రామాల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యులు పురుషోత్తం రెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పీపీపీ విధానాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు వైద్య విద్య, ఉచిత వైద్యాన్ని దూరం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపిం చారు. నాయకులు శేఖర్, కాశిం, డీలర్ రాజేష్, పూజారి లింగప్ప, ఉసేని, వీరేష్, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి దృఢ సంకల్ప దీక్షలో గూడూరు నేతలు

విశాలాంధ్ర-గూడూరు: వాల్మీకుల ఎస్టీ సాధనే లక్ష్యం గా కర్నూలులో తలపెట్టిన వాల్మీకి దృఢ సంకల్ప దీక్షలో గూడూరు వాల్మీకి నేతలు పాల్గొన్నారు. సోమవారం గూడూరు టీడీపీ నేత, మాజీ కౌన్సిలర్ చరణ్ కుమార్ ఆధ్వర్యంలో గూడూరు వాల్మీకి బోయలు భారీగా తరలి వెళ్లి వాల్మీకి దృఢ సంకల్ప దీక్ష కార్యక్రమంలో పాల్గొని ఏపీబివి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడుకు మాలలు వేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చరణ్ కుమార్ మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేదాక తమ పోరాటాలు ఆగవని అన్నారు. వాల్మీకులు ఐకమత్యంగా పోరాటాలు చేస్తే తప్ప ఎస్టి సాధన సాధ్యం కాదని చరణ్ కుమార్ గుర్తు చేశారు. వాల్మీకుల ఎస్టి సాధన పోరాటంలో ముందున్న ప్రతి వాల్మీకి నేతలకు ఎల్లప్పుడూ తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ వాల్మీకి అధ్యక్షుడు బాబు, కమిటీ సభ్యులు మద్దిలేటి, కేశవ్, పోల్కాల్ వెంకటేశు, తదితరులు ఉన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 11, నవంబర్ 2025

వీఆర్వోపై కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో దళితుల భూములను అన్యాక్రాంతం చేసిన మాజీ వీఆర్వో మహబూబ్ పటేల్ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలంటూ సోమవారం ఆదోనిలో సబ్ కలెక్టర్ కార్యాలయం నందు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాదిగ మల్లెమ్మ, మాదిగ అబ్రహం, మాదిగ చిన్నన్న, చంద్రన్న, పక్కిరప్ప, బుల్లి తిక్కన్న మాట్లాడుతూ 1994 సంవత్సరంలో అసైన్మెంట్ కమిటీ ద్వారా తమకు భూమి లేదని ప్రభుత్వం సర్వే నెంబర్ 514 లో భూమి పంచి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో మేము అప్పటి నుంచి భూమిని సాగు చేస్తూ ఉన్నామన్నారు. మాజీ వీఆర్వో మహబూబ్ పటేల్ వచ్చి మీకు ఇంకా ప్రభుత్వం పట్టాలు మంజూరు చెయ్యలేదని, సాగుబడి కొన్ని రోజులు చెయ్యొద్దని, ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన తర్వాత సాగులోకి వెళ్లాలని మమ్మల్ని మభ్యపెట్టి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములను పెద్ద రైతులకు అమ్మారని తెలిపారు . మా పట్టాలు క్యాన్సిల్ చేసి వారి పేర్లమీద పట్టాలు ఇచ్చి వారిని సాగులోకి పంపడం జరిగిందన్నారు. ప్రభుత్వ అసైన్మెంట్ కమిటీ తీర్మానం ప్రకారం ఎవరికైతే భూమిని కేటాయించిందో వాళ్లకే ఆ భూమి చెందాలి కానీ మాజీ వీఆర్వో మహబూబ్ పటేల్ ప్రభుత్వాన్ని, అసైన్మెంట్ కమిటీని మోసం చేసి భూమిని అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. కావున ఉన్నతాధికారులు స్పందించి పేదలను, ప్రభుత్వాన్ని మోసం చేసిన మాజీ వీఆర్వో మహబూబ్ పటేల్ పై క్రిమినల్ మరియు చీటింగ్ కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలించాలన్నారు. అలాగే ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిని సాగు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ప్రమాణ స్వీకారం

- ▸మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బిలేకల్ వెంకటేశ్వర్లు
- ▸రైతుల సంక్షేమమే నా ప్రథమ లక్ష్యం..ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి
- ▸ఆలూరు అభివృద్ధి నా లక్ష్యం.. వైకుంఠం జ్యోతి
- ▸స్థానిక సంస్థలలో ఎన్నికలు విజయం సాధించాలి..ఏపీ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ

విశాలాంధ్ర - ఆలూరు : ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన చైర్మన్‌గా బిలేకల్ వెంకటే శ్వర్లు సోమవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం టిడిపి నేతల ఆధ్వర్యంలో ముందుగా టిడిపి శ్రేణులు, కార్యకర్తలు, రైతులు భారీగా పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఆలూరు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి, బిలేకల్ వెంకటేశ్వర్లు పూలవర్షంలో ప్రమాణ స్వీకార వేదికకు చేరుకున్నారు. కార్యక్రమానికి ముఖ అతిథిలుగా ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఏపీ వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ, టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, మార్కెట్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చైర్మన్ బిలేకల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే నా ప్రథమ లక్ష్యం. మార్కెట్ కమిటీ ద్వారా రైతుల ఉత్పత్తులకు సరైన ధర లభించేలా కృషి చేస్తాను. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు సమాజానికి అండ. వారిని ఆదుకోవడమే ప్రభుత్వ ప్రాధాన్యత. మార్కెట్ కమిటీలు రైతు సంక్షేమానికి కీలక పాత్ర పోషించాలి అన్నారు. వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ ఆలూరు అభివృద్ధే మా ధ్యేయం. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో పారదర్శకతతో ముందుకు సాగుతాము అన్నారు. కప్పట్రాళ్ల బుజ్జమ్మ మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో తెలుగుదేశం పార్టీ తిరిగి విజయపతాకాన్ని ఎగరేయాలి. కార్యక్రమంలో టిడిపి టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళా సంఘ సభ్యులకు జీవనోపాధి

విశాలాంధ్ర-పాణ్యం : మహిళా సంఘ సభ్యులు జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవాలన్నటువంటి ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుపూరు గ్రామంలో నాగలక్ష్మి అనే మహిళ పీఎంఎఫ్ఎం ఈ పథకము ద్వారా ఏర్పాటు చేసుకున్నటువంటి రోటి మేకర్ మిషన్ ,పల్వరైజర్ మిషన్ సోమవారం నంద్యాల జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలైనటువంటి ఉద్దేశ్యముతో వారు సుస్థిర ఆదాయం సంపాదించాలైనటువంటి ఉద్దేశంతో జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవడం అన్నది చాలా ప్రాముఖ్యమైనటువంటి విషయము. ఈ విధంగా మండలంలో ఆసక్తి ఉన్నటువంటి మహిళలందరికీ పీఎంఎఫ్ఎంఈ,పీఎంఈజీపి పథకాల ద్వారా రుణాలు అందించి వారు సుస్థిరమైనటువంటి జీవనోపాదులు ఏర్పాటుఆసక్తి ఉన్నటువంటి మహిళలందరికీ ఈ రుణాలు అందించి వారు సుస్థిరమైనటువంటి జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవడం అన్నటువంటిది చాలా గర్వించదగ్గ విషయం అని అన్నారు. ఏపీఎం ప్రసాద్ మాట్లాడుతూ ఈ విధంగా మండలంలో ఇంకా సంఘాల్లో ఉన్నటువంటి అనేకమంది మహిళలని గుర్తించి వారికి వారి యొక్క వ్యాపార అభివృద్ధిని మెరుగుపరుచుటకు అనేక పథకాల ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమక అధ్యక్షులు సీసీలు, సిబ్బంది వివో ఏలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కార్తీక వనభోజనాలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలోని అల్వార్ కోనేరు సమీపంలోని లక్ష్మీవనంలో వనభోజన మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. శ్రీ ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. 2007వ సంవత్సరం నుండి స్వామివారికి లక్ష్మీ వనంలో వనభోజన ఉత్సవంను ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు వేణుగోపాల్ స్వామి తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉత్సవం అత్యంత అద్భుతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు సహకరించిన దాతలకు వేణుగోపాల్ స్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జనసేన తాలూకా అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. కార్తిక వనభోజనాన్ని పురస్కరించుకొని అహోబిలం ఇస్కాన్ ఆధ్వర్యంలో హరినగరం నిర్వాహకులు చంద్రకేశవ దాస్ బృందం అన్నవితరణ కావించారు.

స్వాతి హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు : అహోబిలం క్షేత్రంలో సోమవారం నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో భక్తుల కోసం స్వాతి హాస్పిటల్ సౌజన్యంతో ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డకు చెందిన వెంకటసుబ్బారెడ్డి హాస్పిటల్ ఎం.డి. డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ శివమ్మ హాజరై ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను కూడా అందజేశారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాయి తేజస్విని , ఫార్మాసిస్టు మధుసూదన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కళ్యాణం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ఆర్ద్ర నక్షత్రంలో స్థానిక సంజీవనగర్ రామాలయంలో శివ పార్వతుల కళ్యాణం, అభిషేక పూజలు నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్ నిర్వహణలో ప్రముఖ సిద్ధాంతి కార్తికేయశర్మ పౌరోహిత్యంలో కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో శివపార్వతుల కళ్యాణ విశిష్టతను ఆయన వివరించారు. కళ్యాణోత్సవం, అభిషేక పూజలలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, సతీమణి సునంద, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కరరెడ్డి, డాక్టర్ ఈశ్వరి, మాజీ ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ హరిత, నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ లలిత, డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్, డాక్టర్ అరుణ కుమారి దంపతులు కంకణ ధారణ చేసి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ అన్ని మతాల పర్వదినాలను అనవాయితీగా నిర్వహి స్తున్నామని, ఐక్య భావన కోసం, లోక కళ్యాణం కాంక్షించి శివపార్వతుల కళ్యాణం నిర్వహిం చామని తెలిపారు. డాక్టర్ సహదేవుడు, భగవత్ సేవా సమాజ్ అధ్యక్షులు సూరయ్య, డాక్టర్ రవికాంత్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ నెట్ల మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ షబ్నం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీకి విశేష స్పందన

విశాలాంధ్ర-కర్నూలు:విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 76 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలపై వారికి సిఎండి శివశంకర్ లోతేటి సమాధానమిస్తూ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సీఎండి కార్యక్రమం ద్వారా నమోదైన 87 సమస్యల్లో 62 సమస్యలను ఇప్పటికే పరిష్కరించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్ డి) కె. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, కె. ఆదిశేషయ్య, పి. సురేంద్ర నాయుడు, యం. మురళీ కుమార్, జనరల్ మేనేజర్లు సి. హెచ్. రామచంద్రరావు, జి. చక్రపాణి, డి. సురేంద్ర రావు, సి. ప్రసాద్, వై. వెంకటరాజు, పి. భాస్కర్ రెడ్డి, డి. జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

టైక్వాండోలో సత్త చాటిన

ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఏపీ స్టేట్ లెవెల్ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల్లో ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆగస్టులో టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారిచే నిర్మించబడిన 5వ ఏపీ స్టేట్ జూనియర్, సబ్ జూనియర్ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ 3వ తరగతి విద్యార్థి మనస్వి బ్రాంజ్ మెడల్, 6వ తరగతి చదుతున్న రిత్విక, 5వ తరగతి మాన్వితలు ప్రోత్సాహకపత్రాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కోటి నాగేశ్వరరావు విద్యార్థినులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, కోఆర్డినేటర్,ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : తెలుగు భాషా సాహిత్యాలకు సిపి బ్రౌన్ చేసిన సేవలు నిత్య స్మరణీయం అని డా.ఎం.ఇందిరా శాంతి అన్నారు. స్థానిక క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా.ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీ బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డా.ఇందిరా శాంతి మాట్లాడుతూ సిపి బ్రౌన్ తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన సేవలను విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. తెలుగు శాఖ విభాగాధిపతి డా.వి.వింధ్యవాసినీ దేవి మాట్లాడుతూ సిపి బ్రౌన్ చేసిన నిరూపమాన సాహిత్య సేవలను స్మరించుకోవడం,వారికి నివాళులు అర్పించడం మనందరి బాధ్యత న్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎ.సత్య నారాయణ మాట్లాడుతూ బ్రౌన్ వంటి ఆంగ్ల అధికారులు చేసిన సాహిత్య సేవ, వెలకట్టలేనిదని, వారి సంఘ సంస్కరణ దృష్టి గొప్పదని అన్నారు. తెలుగు అధ్యాపకులు రాము దాసరి మాట్లాడుతూ ప్రజా కవి, లోక కవి వేమన మనకు దక్కడానికి కారణం సిపి బ్రౌన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జె. హేమంత్, అధ్యాపకులు డా. కామల్లీ నాయక్, డా.నాగన్న, జి.శ్రీనివాస్, డా.మాదన్న తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషను అమలు చేయాలని

విశాలాంధ్ర-హొళగుంద : సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్లా ఖాన్ ఆదేశాల మేరకుహొళగుంద మండలంలో ఎస్‌డిపిఐ ఆలూరు అసెంబ్లీ అధ్యక్షులు అబ్దుల్ హమీద్ ఆధ్వర్యంలో తాసిల్దార్ నిజాముద్దీన్‌కు వినతి పత్రం ఇచ్చారు. అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ తెలుగు మరియు ఆంగ్ల భాషలతో పాటు ఉర్దూ భాషను కూడా ప్రభుత్వ లోగోలు, బోర్డులు, పేరు ఫ లకాలు మరియు పత్రవ్యవహారాల్లో తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. ఉర్దూ భాషను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండవ అధికార భాషగా గుర్తించినప్పటికీ, చాలా కార్యాలయాల్లో అది కనిపించకపోవడం విచారకరం. ఇది రాజ్యాంగం కల్పించిన భాషా సమానత్వ సూత్రాలకు విరుద్ధం. రాష్ట్రంలోని లక్షలాది ఉర్దూ భాషాభిమానుల భావాలను గౌరవిస్తూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి" కోరారు. కార్యక్రమంలో ఆలూరు అసెంబ్లీ కార్యదర్శి హఫీజ్ ,అసెంబ్లీ కార్యవర్గ సభ్యులు షఫీ. మైపూజ్. వాజిద్ కైఫ్ తదితరులు పాల్గొన్నారు

వొకేషనల్ కళాశాల ప్రిన్సిపల్‌కు సౌత్ ఇండియా క్రాంతి పురస్కార అవార్డు

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : మక్ష్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు నిర్వహించిన "సౌత్ ఇండియా అవార్డ్స్ - క్రాంతి పురస్కార్ 2025" (సీజన్-2) అవార్డు , విద్యా రంగంలో విశిష్ట సేవలందించినందుకు కర్నూలు బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ అందుకున్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవం ఆదివారం నాడు హైదరాబాద్, నాంపల్లి లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. డాక్టర్ నాగస్వామి నాయక్ విద్యా విభాగంలో అనేక సంవత్స రాలుగా అంకితభావంతో సేవలు అందిస్తూ విద్యార్థుల్లో నైతిక, సాంస్కృతిక విలువ లను పెంపొందించేందుకు కృషి చేసినందుకు గాను ఈ అవార్డును ఎం.ఎల్.సి. మధుసూదనాచారి, తెలంగాణ గ్రంథాలయ చైర్మన్ రియాజ్, తెలంగాణ ఐసిసి చైర్మన్ నల్ల బాలు, దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : భూములుకోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సోమవారం తాసిల్దార్ విద్యాసాగర్ కిఎం ఆర్‌పిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. మండల ఎంఆర్పిఎస్ ఉపాధ్యక్షులు బండమీది నారాయణ మాట్లాడుతూ మండలంలోని మీది వేముల గ్రామంలో ఏపీఐఐసీ వారు గతంలో భూ సేకరణ చేసినప్పుడు కొంతమందికి మాత్రమే నష్టపరిహారం చెల్లించారని తెలిపారు. అయితే ఆ భూముల్లో ఉన్న బావులు, చెట్లకు ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల ప్రకారం మొత్తం 37మందిలో 17మందికి మాత్రమే బావులు, చెట్లు ఉన్నట్లు పేర్కొన్నా రని, మిగిలిన 20మంది రైతులకూ బావులు, చెట్లు ఉన్నప్పటికీ వారి పేర్లు జాబితాలో లేవు అని ఆయన తెలిపారు. అందువల్ల వారికి కూడా సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని తాసిల్దార్‌ను డిమాండ్ చేశారు. తాసిల్దార్ విద్యాసాగర్ స్పందిస్తూ, బాధిత రైతుల పొలాలను స్వయంగా పరిశీలించి, బావులు, చెట్లు ఉన్న వారికి తప్పకుండా నష్టపరిహారం చెల్లిస్తానని హామీ ఇచ్చారు. రైతులు చెన్నప్ప, బండమీది వెంకటేశ్వర్లు, చిన్న పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పన్నులు త్వరితగతిన వసూళ్లు చేయాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు త్వరితగతిన వసూళ్లు చేయాలని ఆదోని డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణ రెడ్డి ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలో డిప్యూటీ ఎంపీడీఓ జయరాముడు ఆధ్వర్యంలో స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇళ్లకు, ఖాళీ భూములకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను పూర్తి చేసి 9(2) నోటీసుల ప్రకారం అంగీకార పత్రాలు స్వీకరించి వాటిని గ్రామసభలో ఆమోదం తెలిపారు. అనంతరం గ్రామసభలో డివిజనల్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ త్వరలో ప్రతి ఇంటికి ఆస్తి కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. స్వర్ణ గ్రామ పంచాయతీ పోర్టల్ లో ఆన్ లైన్ పన్ను అంచనాలు మరియు పన్ను, పన్నేతర వసూళ్ల ప్రగతిని సమీక్షించారు. పన్నులు, పన్నేతర వసూళ్లు తప్పనిసరిగా స్వర్ణ గ్రామపంచాయతీ పోర్టల్ ద్వారా మాత్రమే ఆన్ లైన్ లో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

16న వాల్మీకి వనభోజనాలు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : వాల్మీకి వనబోజన సమితి ఆధ్వర్యంలో 2025 నవంబర్ 16 వ తేదీన ఎమ్మిగనూరు పట్టణంలోని పోస్టు ఆఫీసు దగ్గర వాల్మీకి సంక్షేమ భవన్ స్థలం లో కార్తీకమాస వనబోజన సమ్మేళనం జరుగుతుందని ఎమ్మిగనూరు వాల్మీకి వనబోజన సమితి నిర్వాహకులు విజిఆర్ కొండయ్య, బిఎల్ నారాయణ,కృష్ణమూర్తి, రాఘవన్, రంగన్న ,మధుబాబు నాయుడు వెల్లడించారు. సోమవారం వాల్మీకి వన భోజన నిర్వాహకులు మీడియా తో మాట్లాడుతూ వాల్మీకి మహర్షి వారసులు గా వాల్మీకి సమాజ అభివృద్ధి ,సంక్షేమం ,ఐక్యతకు కృషి చేస్తున్న వాల్మీకి వన భోజన సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా వన సమ్మేళనం చేపడుతున్నాం. ఎమ్మిగనూరులో జరిగే వాల్మీకి వనబోజనాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.నవంబర్ 16న(ఆదివారం) ఉదయం 9గంటలకు ఉసిరి చెట్టు కు పూజ,10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పరిచయ,మిమిక్రీ కార్యక్రమం ఉంటుంది.మధ్యాహ్నం 2గంటలకు వన భోజన సమ్మేళనం ఉంటుందని తెలిపారు. 3 గంటల నుండి పిల్లలు,మహిళలకు ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని తెలిపారు.సమావేశంలో వాల్మీకి వన భోజన సమితి సభ్యులు జగదీష్,దేవేంద్ర, రామాం జనేయులు, నారాయణ,పెద్దయ్య పాల్గొన్నారు.

మంతెన వెంకట రామరాజు సహకారం మరువలేనిది

విశాలాంధ్ర - బనగానపల్లె: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు అండగా నిలుస్తున్నారని వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ టంగుటూరి సీనయ్య , గణేష్ కమిటీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, లాయర్ అల్లీ హుసేన్ పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు రూ.12వేల విలువచేసే చెక్కును బనగానపల్లె పట్టణానికి చెందిన రహంతుల్లాకు రూ.7వేలు మరొకరికి రూ.5వేలు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లాయర్ నాగేంద్ర, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : నేడు నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, డోన్ సబ్ డివిజన్ పరిధిలోని నంది వర్గం ,బనగానపల్లె పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలు ,లాకప్ గదులు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్టేషన్ రికార్డులు, జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, కాసులు, పనితీరు, పెండింగ్ కేసుల వివరాలు మొదలగు రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వ కంగా మాట్లాడి, క్షుణ్ణంగా విచారించి నిర్దిష్ట సమయంలో చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి విధులు,వృత్తి పరమైన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

విజయవంతంగా యూరాలజీ సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఉభయ తెలుగు రాష్ట్రాల యూరాలజీ వైద్య సంఘం (సొసైటీ ఆఫ్ జెనిటో యూరినరీ సర్జన్స్) ఆధ్వర్యంలో నంద్యాల, కర్నూలు జిల్లాల యూరాలజీ సంఘాల సంయుక్త నిర్వహణలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి యూరాలజీ వైద్య వైజ్ఞానిక సదస్సు విజయవంతమైందని సదస్సు నిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ భార్గవర్ధన్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ జై. బాబురెడ్డి, కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ దాసరి రమేష్ లు తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో 25 మంది జాతీయ స్థాయిలో పేరు గాంచిన యూరాలజీ వైద్య నిపుణులు జననేంద్రియ, మూత్రపిండాలు, మూత్రాశయం,మూత్రనాళాలు ప్రొస్టేట్ వ్యాధుల చికిత్సలో వచ్చిన అధునాతన మార్పులు, వినియోగంలోకి వచ్చిన అత్యంత ఆధునిక పరికరాలపై మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా యూరాలజీ వైద్యులకు అవగాహన కల్పించారన్నారు. నంద్యాలలో ఇంత పెద్ద వైజ్ఞానిక వైద్య సదస్సు నిర్వహించినందుకు నిర్వాహక కమిటీకి రాష్ట్ర మాజీ ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదనరెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్‌లు అభినందనలు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

విశాలాంధ్ర-అవుకు: కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అతి పురాతన ఆలయమైన పట్టణంలోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయం, చెర్లోపల్లిలోని బుగ్గ మల్లేశ్వర స్వామి ఆలయం, శివవరం శివాలయాల్లో అర్చకులు శివుడికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు శివాలయాల వద్దకు చేరుకొని పూజలు చేశారు. ఆలయాల వద్ద మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

ఉర్దూను ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు చేయాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : తెలుగు, ఆంగ్ల భాషలతో పాటు ఉర్దూ భాషను కూడా ప్రభుత్వ లోగోలు, బోర్డులు, పేరు ఫలకాలు, పత్రవ్యవహారాల్లో తప్పనిసరిగా వినియోగించాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ) నాయకులు కోరారు. సోమవారం తాసిల్దార్ జ్యోతి రత్నకుమారిని కలిసి ఆంధ్రప్రదేశ్ రెండవ అధికార భాష అయిన ఉర్దూను ప్రభుత్వ కార్యాలయంలో అమలు చేయాలని వినతిపత్రం అందించారు. అనంతరం ఆళ్లగడ్డ అసెంబ్లీ అధ్యక్షులు ముక్తార్ మాట్లాడుతూ ఉర్దూ భాషను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండవ అధికార భాషగా గుర్తించినప్పటికీ, చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో అది అమలులో లేకపోవడం విచారకరమన్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన భాషా సమానత్వ సూత్రాలకు విరుద్ధమన్నారు. రాష్ట్రంలోని లక్షలాది ఉర్దూ భాషాభిమానుల భావాలను గౌరవిస్తూ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ జనరల్ సెక్రటరీ ఫక్రుద్దీన్, సెక్రటరీ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - బనగానపల్లె: విజయవాడ నగరంలో అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ నందు బనగానపల్లె పట్టణ నివాసి టిడిపి పట్టణ అధ్యక్షుడు దూదేకుల మహబూబ్ ఖాసిం సాహెబ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దూదేకుల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా దూదేకుల ఖాసిం సాహెబ్ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, బీసీ సోదరులు పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథ్ రెడ్డి , మంత్రి సతీమణి బిసి ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా దూదేకుల వారికి దూదేకుల కార్పొరేషన్ ద్వారా నిధులు రావడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, దూదేకుల కార్పొరేషన్ ఎండి , షేక్షావలి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషను అమలు చేయాలి

విశాలాంధ్ర-నందికొట్కూరు : ఉర్దూ భాషను ప్రభుత్వ కార్యాలయాలలో అమలు చేయాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నియోజకవర్గ నాయకులు ఖలీల్ భాష అన్నారు. సోమవారం స్థానిక తాసిల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలుగు, ఆంగ్ల భాషలతో పాటు ఉర్దూ భాషను కూడా ప్రభుత్వ లోగోలు, బోర్డులు, పేరు ఫలకాలు మరియు పత్రవ్యవహారాల్లో తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. అదేవిధంగా ఉర్దూ భాషను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండవ అధికార భాషగా గుర్తించినప్పటికీ, చాలా కార్యాలయాల్లో అది కనిపించకపోవడం విచారకరమన్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన భాషా సమానత్వ సూత్రాలకు విరుద్ధం అని రాష్ట్రంలోని లక్షలాది ఉర్దూ భాషాభిమానుల భావాలను గౌరవిస్తూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా సభ్యులు అబ్దుల్ రహ్మాన్, నియోజకవర్గ అసెంబ్లీ కార్యదర్శి శేక్ అరీఫ్, సభ్యులు అబ్దుల్లా, రఫీ, ఉస్మాన్, సయ్యద్ బాషా, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణంలోని బొమ్మిడాల వాసవి డిగ్రీ కళాశాలలో సోమవారం కార్తిక వన సమారాధన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ కళాశాలలో వృక్ష సముదాయాన్ని సంరక్షించి తర్వాతి తరాలకు అందజేయాలని, వృక్షో రక్షతి, రక్షితః అంటూ కార్తీక మాసంలో వృక్ష జాతులను ఆరాధించడం మన సంస్కృతిలో భాగమైందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అనేక పూలమొక్కలు, అలంకరణ మొక్కలను కళాశాల ఆవరణలో నాటారు. గోవర్ధనం, నందివర్ధనం, నూరు వరాలు, ఆల్మండ్, గులాబీ లాంటి పూల మొక్కలు, క్రోటన్స్, బోగన్ విల్లియా, స్నేక్ ప్లాంట్ లాంటి అలంకరణ మొక్కలను నర్సరీల నుండి తెచ్చి కళాశాలలో వన సమారాధన నిర్వహించారు. కళాశాల సిబ్బంది అందరికీ వన భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రామసుబ్బారెడ్డి, భాస్కర రెడ్డి, నరేంద్రనాథ్ రెడ్డి, కృష్ణ దాసు, రమణారెడ్డి, సంటి రెడ్డి, డాక్టర్ లక్ష్మీదేవి, వెంకటేశ్వర రెడ్డి, భాస్కర్ నాయక్, అన్నపూర్ణ, క్రిష్ణయ్య, పుల్లయ్య, నాగేంద్ర లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.